క్లుప్తంగా

రైతులకు ధాన్యం నగదు చెల్లింపు

గణపవరం: మండలంలోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రూ.75.19 కోట్ల విలువైన 34,441 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ తెలిపారు. ఇప్పటి వరకూ రైతులకు రూ.31.95 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన రూ.43.24 కోట్లు త్వరలోనే చెల్లిస్తామన్నారు. కాల్వలకు నీరు విడుదల చేసినందున రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధం కావాలని సూచించారు. ఈ నెల 5, 6 నాటికి అన్ని కాలువలకు నీరు చేరుతుందని, నారుమడులు సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు ఆర్‌బీకేలలో ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

కౌంటింగ్ ప్రక్రియలో నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న జేసీ, ఆర్వో లావణ్యవేణి

దెందులూరు: దెందులూరు నియోజకవర్గ కౌంటింగ్‌కు సంబంధించి ఈ నెల 4వ తేదీన ఉదయం 6 గంటలలోపు గుర్తింపు కార్డులతో ఏజెంట్లు, చీఫ్ ఏజెంట్లు ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో హాజరుకావాలని జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి అన్నారు. నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల చీఫ్ ఏజెంట్లు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ రోజున 144సెక్షన్, సెక్షన్ 30 అమలులో ఉన్నందున ఊరేగింపులు, ర్యాలీలు, సభలు, బాణ సంచా కాల్చరాదన్నారు. కౌంటింగ్ రోజున మద్యం విక్రయాలు నిషేధమన్నారు. సిబ్బందితో సహా ఏజెంట్లు, చీఫ్ ఏజెంట్లు సెల్ ఫోన్లు, ఇతర ఎల్క్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదన్నారు. కౌంటింగ్ పూర్తయిన తరువాత కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాడ్లు సీజ్ చేసి జిల్లా ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌లో అప్పగించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో నిబంధనలపై జాయింట్ కలెక్టర్ ఏజెంట్లకు అవగాహన కల్పించారు. సమావేశంలో దెందులూరు తహసీల్దార్ వీ.జితేంద్ర, దెందులూరు ఎంపీడీఓ పీ.శ్రీలతతో పాటు నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్యతో ఉత్తమ విద్యార్థులు

భీమడోలు: నైతిక విలువల గల విద్య ద్వారా ఆదర్శవంతమైన విద్యార్థులుగా ఎదుగుతారని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం శిక్షణ తరగతులు ఉల్లాసభరిత వాతావరణంలో కొనసాగాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాలబాలికలకు వివిధ అంశాలపై శిక్షణనిచ్చారు. జిల్లా డైరెక్టర్ టి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా పరిపూర్ణతను సాధించి ఉత్తమ విద్యార్థులు రూపొందుతారని అన్నారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, విద్యార్థులు, పెద్దలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

గణపవరం(ఉంగుటూరు): ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటిస్తూ, కౌంటింగ్ సందర్భంగా ప్రజలు రాజకీయాలకు అతీతంగా సామరస్యంతో మెలగాలని నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్ అన్నారు. శనివారం ఉంగుటూరులో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు లెక్కింపు సందర్భంగా గ్రామాలలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ప్రజలు ఆవేశ కావేశాలకులోను కాకుండా సంయమనం పాటించాలని సూచించారు. గొడవలు, గలాటాలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ సందర్భంగా 144వ సెక్షను, 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుందన్నారు.

వైభవంగా హనుమాన్ జయంత్యుత్సవం


పెదకడిమి దాసాంజనేయ ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు


బాదంపూడి దత్తక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు


వీరభద్రపురంలో విశిష్ట అలంకరణలో ఆంజనేయస్వామి

దెందులూరు: మండలంలో వాడవాడలా వైభవంగా హనుమాన్ జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. ఏలూరు డివిజన్‌లో వీరభద్రపురంలోని ఆంజనేయ విగ్రహం వద్ద భక్తులు పూజలు, ప్రదక్షిణలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఉప్పే రంగారావు, ఆలయ అర్చకులు స్వామివారికి విశేషాలంకరణ చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. దెందులూరు, సీతంపేట, రామారావుగూడెం, ధర్మారావుపేట, గంగన్నగూడెం, గాలాయగూడెం, చల్లపల్లి, పోతునూరు, కొవ్వలి గ్రామాల్లోని స్వామివారి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటి చైర్మన్ తీర్థప్రసాదాలను అందజేశారు.

భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు

దెందులూరు: చల్లచింతలపూడిలో హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా పాటిమ్మ, ఆంజనేయస్వామికి శనివారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ యలమర్తి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

పెదపాడు: హనుమద్ జయంతిని పురస్కరించుకుని ఏలూరులోని ఫిరంగుల దిబ్బ ఆంజనేయస్వామిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. తొలుత జిల్లా పరిషత్ చైర్మన్ దంపతులకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కలవకొల్లు సాంబ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

పెదవేగి : పెదవేగి మండలంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెదకడిమిలోని పులి కుంట దాసాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రాము ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా రాయన్నపాలెం ఆంజనేయస్వామి ఆలయానికి వచ్చిన స్థానిక నాయకులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం యువత, చిన్నారుల కోలాట నృత్య ప్రదర్శన అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాదంపూడి దత్తక్షేత్రంలో పూజలు

గణపవరం(ఉంగుటూరు): బాదంపూడిలోని దత్తక్షేత్రంలో పెద్ద సంఖ్యలో భక్తులు ఆంజనేయుడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద భజనలు, ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

భీమడోలు రైల్వే గేటు వద్ద..

భీమడోలు: భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఆంజనేయనగరం, సూరప్పగూడెం, పోలసానిపల్లి, ఎంఎంపురం గ్రామాల్లో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని విశేష పూజలు చేశారు. అనంతరం ఆంజనేయస్వామికి గ్రామోత్సవం నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. హనుమాన్ చాలీసా, పారాయణ అనంతరం ఆలయాల్లో భక్తులకు ప్రసాదాలు, పానకాలు అందించారు. పోలసానిపల్లి పంచాయతీ శివారు ఆంజనేయనగరం వద్ద అభయాంజనేయ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పోలసానిపల్లి బీసీ కాలనీలో అన్నసమారాధన నిర్వహించారు.


ఏలూరులోని ఫిరంగుల దిబ్బ ఆంజనేయస్వామి ఆలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ


పాటిమ్మ, ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న చైర్మన్ యలమర్తి


రాయన్నపాలెంలో కోలాట నృత్య ప్రదర్శనలో పాల్గొన్న బాలికలు


భీమడోలులో భక్తులకు పానకం, ప్రసాదాలను అందిస్తున్న దాతలు

ఆంజనేయుడి ఆలయాలు భక్తులతో కిటకిట


పూజలు చేస్తున్న భక్తులు

గణపవరం: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. గణపవరంలోని ప్రసిద్ధ సువర్చలాసహిత ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులు ఉదయం నుంచి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు కై తేపల్లి శ్రీను ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వంకాయల రామారావు, వైస్ చైర్మన్ టాక్సీ రాజబాబు దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయం వద్ద భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. బువ్వనపల్లిలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంకు చందు దంపతులు పీటలపై కూర్చుని స్వామివారికి పూజలు చేశారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సోదరులు పుప్పాల కార్తీక్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


గణపవరంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్న విద్యాశాఖ అధికారులు

గణపవరం: మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని గణపవరం ఎంఈఓలు పి.శేషు, జి.బాలయ్య నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం గణపవరం మండల విద్యావనరుల కేంద్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం రోజువారీ మెనూ సక్రమంగా పాటించాలని, ప్రమాణాల మేరకు ఆహార పదార్థాలను తయారు చేయాలని ఎంఈఓలు అన్నారు. వంట చేసే పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆహారంలో పోషకాలు వండటం, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం నిర్దేశిత సరుకులు వినియోగించాలని సూచించారు. మధ్యాహ్న పథకాన్ని ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. నాణ్యత పాటించని ఏజన్సీలను తొలగించి, కొత్తవారికి అవకాశం ఇస్తామన్నారు. నిర్వాహకులు ప్రభుత్వ మెనూలోని పలు రకాల వంటకాలను తయారు చేశారు. వంటకాల నాణ్యతను పరిశీలించిన విద్యాశాఖ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ

పెదపాడు: మండలంలోని సత్యవోలులో విశ్రాంత ఉపాధ్యాయుడు అల్లు రామకృష్ణ మరణించాడు. బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు తదితరులు శనివారం రామకృష్ణ మృతదేహానికి పూలమాల వేసి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మృతుడు అల్లు రామకృష్ణ అనేక మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఎంతో సేవ చేశారన్నారని ప్రసాదరావు కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ కల్యాణోత్సవం

- ఘనంగా హనుమంతుని కళ్యాణం
- మండలంలో ఘనంగా హనుమజ్జయంతి ఉత్సవాలు


పెదపాడులో సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి కల్యాణోత్సవం


అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయంలో పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


పెదపాడులోని సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో, పెదపాడులోని సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో, గండిచెరువుగట్టు వీరాంజనేయస్వామి ఆలయంలో, ఏపూరులోని సీతారామ లక్ష్మణ సమేత అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమద్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భక్తులు బారులు తీరారు. ఈ ఉత్సవాల్లో రాష్ట్ర ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ఉదయం మల్లెపూలతో పూజలు చేశారు. అనంతరం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. రాత్రి స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరాంజనేయస్వామి ఆలయంలో ధర్మకర్తల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం హోమాలు అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు వెంకటరమణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గణనీయంగా పెరిగిన విద్యుత్ వినియోగం

- సాంకేతిక సమస్యలతో సరఫరాకు అంతరాయం
- అధికారుల కృషితో మెరుగైన విద్యుత్ సేవలు


పెదవేగి విద్యుత్ సెక్షన్

పెదవేగి : వేసవి సీజన్‌లో విద్యుత్ వాడకం గణనీయంగా పెరిగింది. వేసవికి ముందు కన్నా ఈ సీజన్‌లో రెండు మెగావాట్ల విద్యుత్ వాడకం పెరిగింది. జూన్ రెండో వారం వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏసీ వంటి విద్యుత్ ఉపకరణాల వినియోగం పెరగడంతో సరఫరాలో పది రోజులుగా తీవ్రమైన సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయి. వేసవి ప్రారంభంలో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, ట్రిప్ అవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సవాళ్లను అధిగమించిన అధికారులు కొన్ని రోజుల నుంచి విద్యుత్‌ను సక్రమంగా అందిస్తున్నారు. ప్రతి మండలంలో కొన్ని గంటలు విద్యుత్ కోత అమల్లో ఉంటుందని చెబుతున్నారు. పెదవేగి మండల పరిధిలో మాత్రం విద్యుత్ కోత లేకుండా చేయడంలో అధికారులు సఫలమయ్యారు.

రెండు సెక్షన్ కార్యాలయాల పరిధిలో వినియోగం ఇలా...

మండలంలో జానంపేట సెక్షన్ కార్యాలయ పరిధిలో 13, పెదవేగి సెక్షన్ కార్యాలయ పరిధిలో 17 పంచాయతీలు ఉన్నాయి. జానంపేట విద్యుత్ స్టేషన్ పరిధిలో సాధారణంగా 20 మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉండేది. ఏప్రిల్ 15 నుంచి ఆ వినియోగం ఎనిమిది మెగావాట్లకు చేరింది. పెదవేగి స్టేషన్ పరిధిలో 30 మెగావాట్ల వినియోగం ఉండగా ప్రస్తుతం 35 మెగావాట్లకు చేరింది. తరచూ ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలను అధిగమించేందుకు లైన్ విడదీసి, కేబుల్, కండక్టర్లను మార్చారు. లో ఓల్టేజీ సమస్యకు రెండు సెక్షన్ స్టేషన్ల పరిధిలో 650 సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు, 6వేల త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. దీంతో వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించగలుగుతున్నట్లు అధికారులు తెలిపారు.

సమస్యలను పరిష్కరించాం



వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాం. లో ఓల్టేజ్ సమస్య ఉన్న చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. సాంకేతిక పరమైన సమస్యలను అధిగమించి వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందించి, వారి మన్ననలు అందుకుంటున్నాం.

– కె.నాగేశ్వర విద్యుత్‌శాఖ ఏఈ, పెదవేగి

ఏజెంట్లకు మద్యం నిర్ధారణ పరీక్షలు

దెందులూరు: కౌంటింగ్ రోజు లోపలికి వెళ్లే చీఫ్, ఏజెంట్లకు విధిగా మద్యం నిర్ధారణ పరీక్షలు చేస్తామని, మద్యం సేవించిన వారిని కౌంటింగ్ హాలులోకి అనుమతించమని ఏలూరు డీఎస్పీ, కౌంటింగ్ సెంటర్ ఇన్‌ఛార్జి (రక్షణ విభాగం) ఈ.శ్రీనివాసులు అన్నారు. శనివారం డీఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ సెంటర్‌కు వచ్చేవారితో సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించమని చెప్పారు. కౌంటింగ్ అనంతరం రాజకీయ పార్టీలు వాట్సాప్ గ్రూపుల్లో విమర్శలు, దూషణలు చేయరాదని తెలిపారు. వాట్సాప్ గ్రూపుల్లోని పోస్టులకు ఆ గ్రూపు అడ్మినే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కౌంటింగ్ సెంటర్ పరిధిలో సెక్షన్ 30, సెక్షన్ 144 అమలులో ఉంటాయన్నారు. ఈ నెల 6 వరకు ఇద్దరు లేదా ముగ్గురుకి మించి ప్రజలు గుమికూడరాదన్నారు. రౌడీషీటర్లపై నిఘా ఉంటుందన్నారు.

పకడ్బందీగా మధ్యాహ్న భోజన పథకం


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న అధికారులు


గ్యాస్ ప్రమాదాల నివారణపై ఫైర్ అధికారుల ప్రదర్శన

భీమడోలు: మధ్యాహ్న భోజనం పథకం పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా కోఆర్డినేటర్ గౌస్‌మోహిద్దీన్ అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో శనివారం ఎండీఎం నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోజు వారీ మెనూ, పోషక విలువలతో కూడిన ఆహారం తయారీ, వంటల పోటీలు, గ్యాస్ ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎంఈవో-22 అయినపర్తి భాస్కర్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈవో-1 ఈదుపల్లి శ్రీనివాసరావు, జిల్లా ఎండీఎం కోఆర్డినేటర్ గౌస్‌మోహిద్దీన్, జిల్లా శానిటేషన్ కోఆర్డినేటర్ శ్రీకుమార్ పాల్గొన్నారు. విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యవంతులు కావడానికి ఎండీఎం నిర్వాహకుల పాత్ర కీలకమన్నారు. పోషక విలువలతో కూడిన రుచికరమైన ఆహారం అందిస్తే విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరవుతారన్నారు. జిల్లా శానిటేషన్ కోఆర్డినేటర్ శ్రీకుమార్ మాట్లాడుతూ వంట చేసే పరిసరాలు, వంట గది, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. భీమడోలు అగ్నిమాపకాధికారి జి.నాగరాజు మాట్లాడుతూ గ్యాస్ ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎండీఎం నిర్వాహకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఎండీఎం నిర్వాహకులకు కేటాయించిన మెనూ ప్రకారం ఆహార పదార్థాలను తయారు చేయగా రుచి చూసిన అధికారులు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆహ్మద్, సీఆర్‌పీలు, ఎండీఎం నిర్వాహకులు పాల్గొన్నారు.